# చన్నీళ్ళు

"వీధి అరుగుమీద గొంతుకిళ్ళా కూర్చోడం కాదు. లే లేచి ప్రయత్నించు" అని వెన్నుతట్టి చెప్పినట్టే అయింది. బయటకొచ్చి అరుగుమీద కూర్చుని అరగంట అయిపోయింది. రెండిళ్ళ అవతల గోడ గడియారం అరగంట కొట్టి పాడింది. అరేడు జంత్రవాద్యాలు ఒక్కసారి మోగినట్టు అది మోత పెడుతుంది. అరున్నరయిందని కోటేశ్వరరావుకి సుస్వరాలతో చెప్పినట్టయింది.

కోటేశ్వరరావు అరుగు మీంచి గెంతి రోడ్డుమధ్యకెళ్ళి నిలబడ్డాడు. రోడ్డుపొడుగునా దృష్టులు సారించి చూశాడు. శకునంకోసం కాదు. శకునం జ్ఞాపకంలోనూ లేదు. వాడి మనస్సు సందిగ్ధావస్థలో పడి జంకు పుట్టిస్తున్నాది.

"వెళ్ళనా?" అనుకుంటూ వెళ్ళకుండా ఉండిపోతున్నాడు. వెళ్ళకపోతే వీల్లేదు. ఇంకో గత్యంతరంలేదు. వెళ్ళిన తరువాత అనుకొన్న పని హాయిగా జరిగిపోవచ్చు. పట్టుకున్న బెదద మంచులాగ కరిగిపోవచ్చు. ఒకవేళ వెళ్ళినా ప్రయోజనం లేకపోతే మరో ప్రయత్నం చేసుకోవచ్చు.

వెళ్ళడానికి ధైర్యం చాలలేదు! ఛటీమని మళ్ళా అరుగుమీదికి ఎగిరి, గొంతుకిళ్ళా కూర్చుని, రెండు చేతుల్తో రెండు మోకాళ్ళ గట్టిగా పట్టుకుని రోడ్డుకి అటూ యిటూ చూస్తున్నాడు. వీధిలో జనసంచారమే లేదు.

అకస్మాత్తుగా వీధి వీధంతా మారిపోయింది. ఆ చివరినుంచి ఈ చివరిదాకా అరుపులు ప్రారంభమయాయి. కావిళ్ళు, తట్టలు వచ్చిపడ్డాయి. వీధి వీధంతా నడుస్తున్న అంగడి అయిపోయింది. వీధి రెండు వాసల ఇళ్ళ వాళ్ళు బయటికి వచ్చేశారు. ఆడా, మొగా, పిల్లా, పాపా, కూరలబేరం కోలాహలంతో నిండిపోయింది....కూరలు అరుస్తున్నాయి.

"వంకాయలు, బెండకాయలు" "అరటి కాయలు, అరటి ఆకులు" "నూనకార, తెలగపిండి" స్త్రీ కంఠాలు పురుష కంఠాలు వీధిని ఎగర గొడుతున్నాయి. కట్టెల కావిళ్ళు డొక్కుల కావిళ్లు దిగబడి అరుస్తున్నాయి. డబ్బుంటే బజారు వెళ్ళక్కర్లేదు అన్నీ గుమ్మంలోకొస్తాయి.

"రేపు డొక్కుల కావిడి వేయించుకోవాలి" అనుకున్నాడు కోటేశ్వరరావు.

స్కూళ్ళకి పోతున్న పిల్లలు బయలుదేరారు ఆడా మగా తేడాలేని దుస్తులతో. ఆడా మగా తేడా చదువుల్లో లేదు. ఉద్యోగాల్లో లేదు. వేష భాషల్లో లేదు!

పొద్దున్న రైలు రైటు టైముకే వచ్చేసింది. మొగుడూ, పెళ్ళాం, పిల్లలతో రైలుదిగి వస్తున్న రిక్షా వీధిలోంచి పోతున్నాది. రిక్షా తరవాత రిక్షా-రిక్షాలు వెళుతున్నాయి.

కాలం కదిలిపోతున్నాది. కోటేశ్వరరావు కదలలేదు!

ప్రతి క్షణం వెళదామనుకొంటున్నాడు. సాహసించలేక పోతున్నాడు. కాళ్ళకి శిలలు కట్టినట్టు గొంతుకిళ్ళా కూర్చుండి పోయాడు. రక్తం కిందికి దిగి కాళ్ళు తిమ్మిరెక్కుతున్నాయి. గొంతుకిళ్ళా కూర్చోడం ఇబ్బందిగా ఉందని తెలుస్తున్నాది. మనస్సు అన్యధా ఆలోచిస్తున్నాది! వో పక్క తెలుస్తున్నా, శరీరం దానిని గుర్తించలేదు. చతికిళ్ళపడొచ్చు. సుఖంగా కూర్చొని రోడ్డుని చూస్తూ కాలక్షేపం చెయ్యోచ్చు. చతికిళ్ళాపడితే ఎలాగ లేచి వెళ్ళాలి!

కొంచెం కదిలాడు. తిమ్మిరెక్కుతున్న పిక్కల్ని కొంచెం సర్దుకున్నాడు. జేబులో కరకరలాడి చిట్టుమని చిట్లింది! దాంతో ప్రాణం లేచి వచ్చింది. జేబులో మూడు బీడీలు, అగ్గిపెట్టె వున్నాయి. బ్రద్దలైన బీడీని అగ్గిపెట్టెని పైకితీశాడు. బీడీ చిట్లి రెండు ముక్కలై పోలేదు. వేలు అడ్డు పెట్టి కాల్చడానికి వీలుగానే ఉంది. అగ్గిపుల్ల తీసి వెలిగించబోయి మానేశాడు. ఏమంటే వీధిచివరనుంచి ఇద్దరు పంతులమ్మలు వయ్యారంగా వస్తున్నారు!

ఎదురువాస ఇంట్లోంచి చిన్న కుర్రవాడు సైకిలుతో బైట కొచ్చాడు. పన్నెండేళ్ళు ఉంటాయి. వాడి తండ్రి బైటకొచ్చాడు.

"ఏముందిరా? అరగంటకల్లా వచ్చేస్తావు. రెండు మైళ్ళు వెళ్ళి రావడానికి ఎంతసేపౌతుంది. గభాల్న వెళ్ళి గభాల్నరా" అని తండ్రి కొడుకుకి చెపుతున్నాడు. సైకిల్ని జోరుగా వీధిలోకి తోసి ఒక్క ఎగురు ఎగిరి ఝూమ్మని తొక్కుకుంటూ కుర్రాడు వెళ్ళాడు.

"ఒరేయ్ ఇక్కడున్నట్టు రావాలి" అని వాళ్ళనాన్న వాడి వెనకాతల బొబ్బపెట్టి లోపలికి పోయాడు. వాళ్ళకి రెండు మైళ్ళ దూరంలో ఊర వతల పొలం ఉంది. చిన్న వ్యవసాయం ఉంది. కుర్రవాడు హుషారుగా తొక్కుకుంటూ పోయాడు.

పంతులమ్మలు పొచ్చేస్తున్నారంటే ఏడుగంటలు దగ్గరౌతున్నది. ఏడింటికే ఎలిమెంటరీ స్కూలు. కోటేశ్వరరావు పెళ్ళాం బయటికి వచ్చింది.

"వెళ్ళొచ్చారా?" అంది.

"నా మొహం వెళ్ళందే! అన్నాడు.

"ఏం?"

"చిన్న అధైర్యం!"

"నే వెళ్ళనా?"

"నువ్వయితే వంటింట్లో కెళతావు. నేనయితే సావిట్లో కెళతాను."

"నిజమే. మరి మీరు వెళ్ళడంలేదు! ఇందాకనగా బయలుదేరారు. అరుగుమీద చతికిళ్ళా పడ్డారు."

"కొంచెం ఆలస్యం కావడం మంచిదే. వాళ్ళు టిఫిన్లు కాఫీలు తీసు కుంటూ ఉంటే అసహ్యంగా ఉంటుంది" అని సర్ది చెప్పాడు. కాని నిజం కాదు. పెళ్ళాం అరుగు వొడ్డుకి వెళ్ళింది.

"ఆనపకాయలమ్మా" అంటూ ఆనపకాయల వాడు వచ్చాడు.

"ఇవాళ వద్దు" అంది.

"లేతవమ్మా. సవగ్గా ఇచ్చేస్తాను."

"రేపు తే."

"చలికాలం ఆనపకాయలు చవకై పోయాయి" అన్నాడు కోటే శ్వరరావు.

"ఏడైపోయింది. టీచర్లు వచ్చేస్తున్నారు" అన్నాది.

"నే వెళతా. నువ్వు లోపలికి వెళ్ళు" అన్నాడు.

"చూడండి వాళ్ళు ఎంత హాయిగా బతుకుతున్నారో? మనం చేజేతులా పొదులుకొన్నాము."

"నిజమే మనకి జ్ఞానం లేకపోయింది."

"ఇప్పుడైనా ప్రయత్నం చెయ్యాలి."

"చేస్తున్నాంగదా!"

"ఏం చేస్తున్నామో! మీరు త్వరగా వెళ్ళిరండి" అని లోపలికి వెళ్ళిపోయింది.

కోటేశ్వరరావు వెళదా మనుకొంటూ వెళ్ళలేకపోతున్నాడు. బిడియం, అధైర్యం. తీరావెళితే సానుకూలం కాదేమో — అనుమానం. వెళ్ళక వీల్లేదు.

పంతులమ్మలు దగ్గరకు వచ్చేశారు. ఇద్దరూ క్రైస్తవరాళ్ళు. కాస్త వొళ్లున్న ఆవిద మార్జొరీ. బక్కపలచటి ఆవిద ఎమిలమ్మ. ఎమిలమ్మ వాలుజడ వేస్తుంది. జుత్తులో నల్లవెంట్రుకలు, తెల్లవెంట్రుకలూ సమపాలులో వున్నాయి. నలుపూ తెలుపూ వాలుజడని వెనక్కి, ముందుకి విసురుతూ ఉంటుంది. ఎప్పుడూ జడమీద తనుపే. పట్టుకొని ఆడుకుంటూ ఉంటుంది. జడమీద మమకారం ఇంతా అంతా కాదు.

వాళ్ళు దగ్గరకు రాగానే రోడ్డంతా పరిమళించింది. ఏ పరిమళాలు రాసుకుంటారో మరి ఎంత రాసుకుంటారో వాళ్ళు ఉన్నచోట మల్లెమొగ్గలు విడుతున్నట్లు ఉంటుంది.

మార్జొరీ మహావేషధారి. ఆవిడకు ఎన్ని రంగుల చీరలున్నాయో అన్నిరంగుల చెప్పుజోళ్ళూ ఉన్నాయి. నెల ముప్పై రోజులూ ముప్పై చీరలూ మారుస్తుంది. ఆవిడ కట్టే ఏ చీరా నూరు రూపాయలకు అవతలే కాని ఇవతల బజారులో దొరకవు. రోజుకో చీర కట్టినట్టే ఓపిగ్గా రోజుకో "హెయిర్ స్టెయిల్" మారుస్తుంది.

ఇద్దరూ కోటేశ్వరరావుని నవ్వు మొహాలతో పలకరించారు.

"ఎక్కడకో వెళుతున్నట్టున్నారు. బయలుదేరకపోయారా? నేను శకునం వస్తున్నానుకదా?" అన్నాది మార్జొరీ.

"మీ శకునం మంచిదికాదు" అన్నాడు కోటేశ్వరరావు.

"నాకన్నా మంచి ముత్తైదువ ఉంటుందా?" అన్నాది మార్జారీ.

"క్రైస్తవులు ఐదువలుకారు" అన్నాది ఎమిలమ్మ. ఆవిడ అర్థాన్ని లాగింది.

"అదేం కాదు. మార్జారీ అన్న పేరులోంచి రాకూడదని ధ్వని వస్తుంది. అప్పుడు మంచి శకునం కాదు" అన్నాడు.

"అమ్మా నన్ను మార్జాలం అంటున్నారా? ఇదివరకూ మీరు ఈ ప్రయోగం నా మీద చేశారు. పిలవండి మీ ఆవిణ్ణి చెపుతాను!" అన్నాది మార్జారీ.

"ఏదీ మీ ఆవిడ? కనబడ్డం మానేసిందేం?" అన్నాది ఎమిలమ్మ.

"లోపల ఉంది" అన్నాడు కోటేశ్వరరావు.

"ఘోషాలో పెట్టేరా?" అంది ఎమిలమ్మ. జడని రెండు చేతులతో పట్టుకుంది.

"ఘోషాలో కాదు. ఖరీదైన వస్తువుల్ని భోషాణంలో దాస్తారు." అన్నాది మార్జారీ.

"అలివేలమ్మా అలివేలూ!" గట్టిగా అరిచింది జడని వెనక్కి విసురుతూ ఎమిలమ్మ.

"ఆఁ" అంటూ బైటకొచ్చింది అలివేలు.

"మడికట్టుకున్నావా?" అన్నాది మార్జారీ. అలివేలు మాసిన చీర కట్టుకుంది. అందుకే లోపలికి పోయింది.

"మరేం" అన్నాది అలివేలు.

"మడికోకంటే అలాగ ఉంటుందా?" అన్నాది మార్జారీ.

"వాళ్ళాయన మడిగా ఉండనిస్తారా?" అన్నాది ఎమిలమ్మ. వెనక నుంచి జడని ముందుకు తీసి బుజంమీంచి విసిరింది. జడ మెడచుట్టూ నాగు పాములా చుట్టుకుంది.

"ఆయన పెళ్లాన్నెక్కడ చూస్తున్నారు? పీధి కొమ్మెక్కి కూర్చున్నారు. ఈ తోవని ఆడవాళ్ళని నడవ నిచ్చేటట్టు లేదు!" అన్నాది మార్జారీ.

"మా ఇద్దరి మధ్యా తగాయిదా తెచ్చి పెట్టేటట్టు ఉన్నారు" అన్నాడు కోటేశ్వరరావు.

"పెళ్ళానికి కాస్త మంచి చీరలు కొంటే తగాయిదాలు రావు" అన్నాది మార్జారీ.

"ఒక్క జీతంమీద మేం బతకాలి. మీలాగ చీరలు కట్టడానికి నేనేం ఉద్యోగం చేస్తున్నానా?" అంది అలివేలు.

"నిన్ను ఉద్యోగం చెయ్యొద్దని ఎవరన్నారు? చదువుకుని వంటింట్లో కూర్చున్నావు" అన్నాది ఎమిలమ్మ.

"చక్కగా ట్రైనింగు అయివుంటే ఎంత బాగుణ్ణు. రెండు ఉద్యోగాలు ఖాళీ అవుతున్నాయి. ముందు ఎమిలమ్మదీ, తరవాత నాదీ" అన్నాది మార్జారీ.

"అంత దగ్గర పడిపోయిందా?" అన్నాడు కోటేశ్వరరావు. జడని ముందుకు పట్టుకుని ఎమిలమ్మ రెండడుగులు వేసింది, స్కూలుకు వేళ అవుతున్నాదని.

"మూడు నెలల్లో నేను రిటైరవుతున్నాను. తరవాత రెండు నెలల్లో మార్జారీ రిటైరవుతుంది. రెండు టీచరు పోస్టులు ఖాళీ" అని ఎమిలమ్మ రిస్టు వాచీలో టైము చూసుకొని "పద" అన్నాది. మార్జారీ 'పద' అని రెండడుగులు వేసింది.

"టీచరు పనే చెయ్యాలా ! చెయ్యాలని ఉంటే ఇంకో పని చెయ్యకూడదా?" అన్నాది ఎమిలమ్మ. వెనక్కి తిరిగి జడ చేత్తో పట్టుకుని జడ కొస ఝుళిపిస్తూ "ఏమండోయ్ కోటేశ్వరరావుగారూ ఆడవాళ్ల శ్రమలేందీ అకళ్లు తీరవు. కాలం మారిపోతున్నాది. ఆవిడకు ఏదైనా ఉద్యోగం చూడండి" అని హితవు చెప్పింది ఎమిలమ్మ.

వాళ్లు వెళ్ళిపోతూ ఉంటే వాళ్ళచుట్టూ ఉన్న పరిమళాలు వాళ్ళని వెంబడించాయి. వాళ్లు పదడుగులు వెయ్యగానే వాళ్ళవెంట వాళ్ళ వాసనలూ వెళ్ళిపోయాయి.

"అదృష్టవంతులు" అన్నాది అలివేలు.

"మెల్లిగా అంటావు !" అన్నాడు కోటేశ్వరరావు.

"మనకా అదృష్టం పడుతుందా?"

"పట్టాలి" అన్నాడు.

ఆకాశం చివరినుంచి "బ్ర్రు" ప్రారంభమైంది. అది హెలికాప్టరు "బ్ర్రు." లోహపు శబ్దాలతో కణకణలాడుతూ ఎదురు వాస పెణకల మీంచి వచ్చి చెవులు చిల్లులు చేస్తూ వాళ్ళ పెణకల మీంచి వెళ్ళిపోయింది. అంతా వీధిలోకి వచ్చి ఉత్తర దిశగా పోతున్న హెలికాప్టర్ని తాము మాస్తూ పిల్లలకి చూపిస్తూ వింతపడ్డారు.

"విశాఖపట్నంలో ఇవాళ పొద్దున్న ఏడున్నరకి పబ్లిక్ మీటింగు. ఆ మహానాయకుడి ప్రోగ్రాము నిన్న పేపర్లో చదివాంగా" అన్నాడు కోటేశ్వరరావు.

"ఇంకెవరు వెళుతున్నారో!" అన్నాది అలివేలు.

"లేదు అతండే విశాఖపట్నం వైపే పోతున్నాది. బ్రహ్మాండమైన బహిరంగ సభ."

"ఏముంది? కాఫీ తాగి బెజవాడలో బయల్దేరి ఉంటాడు. గంటకల్లా విశాఖపట్నంలో దిగుతాడు. మీరు మాత్రం మూడిళ్ళ అవతలకి వెళ్ల లేక పోయారు."

"నిజమే! మరో అరగంటలో వేదికెక్కి దండ వేయించుకుని ఉపన్యాసం దంచి మధ్యాహ్నం భోజనానికి కటకం చేరుకుంటాడు."

"వాళ్లకేం మహానాయకులు. మీరు త్వరగా వెళ్ళిరండి" అని అలివేలు లోపలికి వెళ్ళిపోయింది.

చేతిలో అగ్గిపెట్టి దానడుగున బద్దలైన బీడీ ఉన్నాయి. బీడీ ముట్టించాడు. చిట్లుమీద వేలు అడ్డంగా పెడితే పొగ హాయిగానే వచ్చింది. "అమ్మయ్య" అనుకొన్నాడు. పంతులమ్మ రాకతో బీడీ కాల్చడమయింది కాదు. కాల్చడానికి చిన్నతనం వేసింది.

చెదురు మొదురుగా కూరల కావిళ్లు ఇంకా వీధిలో ఉన్నాయి. అందులో ఒక దుంపల కావిడి వచ్చింది. కోటేశ్వరరావు పిలిచాడు. మంచి దుంపలన్నీ చెల్లిపోయాయి. ఖారిగె దెబ్బలు తిన్నవి మిగిలాయి. అయినా అరకేజీ కొన్నాడు. బాగా పెద్ద సైజువి. రెండే రెండు తూగేయి. లోపలికి పట్టుకెళ్ళి అలివేలు కిచ్చాడు.

"మరో నాలుగు కొనలేకపోయారా? తీరిపోను!" అన్నాది అలివేలు.

''ఇద్దరికి చాలవూ?'' అన్నాడు.

''ఇద్దరికి సరిపోతాయి. ఇద్దరికి చాలవు'' అని అలివేలు పకపకా నవ్వడం మొదలెట్టింది.

''నవ్వుతున్నావేం ?''

''ఏడిస్తే బాగుంటుందా?''

''నవ్వితేనే బాగుంటుంది. నువ్వు చక్కగా నవ్వుతావు. హాస్య మంటే ఇది హాస్యం. ఇద్దరికి సరిపోతాయి ! ఇద్దరికి చాలవు!'' అని కోటేశ్వరరావూ విరగబడి నవ్వేడు.

అలివేలు పరీక్షగా మొగుడివంక చూసింది.

''అలాగా నావక్క చూడకు'' అన్నాడు.

''చిల్లంగి పెడుతున్నాయా నా కళ్లు ?''

''కళ్లు నిలబెట్టి చూశావా నా మతి చెడిపోతుంది.''

''మతి చెడకుండా తిన్నగా వెళ్లండి.''

''వెళుతున్నాను'' అని బయటకు వెళ్ళేడు. వీధిలోకి వెళ్ళి ''అన్నా !'' అనుకున్నాడు. జనార్దనరావు వీధిలోకి వెళ్ళిపోతున్నాడు! ''కాని!'' అనుకొని మరో బీడీ తీసి ముట్టించాడు. అరుగుమీద చతికిల్లా పడి గోడకి చేరబడి సంతృప్తిగా బీడీ కాల్చాడు. ఈ పూట విధిగా జనార్ధనరావుని పట్టుకుంటాను'' అనుకొని స్థిమితపడ్డాడు. నాలుగు దమ్ముల్తో ధైర్యం వచ్చింది. బీడీ పారేసి లోపలికెళ్లాడు. పెళ్ళాం గడప మీద తలపెట్టుకుని కళ్లు మూసుకు పడుకుంది. స్టవ్వుమీద సీళ్లలో దుంపలు ఉడుకుతున్నాయి. దాని పొత్తికడుపుకి దగ్గరగా కూర్చున్నాడు. మూడో బీడీతీసి ముట్టించాడు. తాపీగా పొగ వొదులుతూ ఆలోచనలలోంచి ఆలోచనలలోకి పోతూ ప్రస్తుతాన్ని మరచిపోయాడు. మధ్యన బీడీ అయి పోవడం, దాన్ని కిటికీలోంచి పారెయ్యడం వాడికి తెలియకుండానే జరిగి పోయింది! ఎంత టైమైపోయిందో అవగాహనంలో లేదు. రెండిళ్ల అవతల నుంచి గోడగడియారం జంత్రవాద్య సమ్మేళనంతో గంటతరవాత గంట అదేపనిగా కొడుతున్నాది.

''పది కాదుకదా ? పదైతే చిక్కే !'' అని దిగ్గని కోటేశ్వరరావు లేచాడు. అలివేలూ లేచింది.

''అమ్మయ్య వచ్చారా?'' అంది.

''వెళ్ళలేదు'' అన్నాడు.

''ఏం ?''

''జనార్దనరావు వీధిలోకి వెళ్ళాడు.''

''చచ్చాం, ఎప్పుడు వస్తారో ?''

''పరవాలేదు వాణ్ణి పట్టుకుంటాను'' అని బయటకు వెళ్ళిపోయాడు.

పేపర్ల కుర్రవాడు ఇంటింటికీ పేపర్లు ఇస్తూ, సైకిలుమీద పోతున్నాడు. బ్రతికించాడు. ఇంకా ఎనిమిదే అయింది. వాడు జనార్దనరావు ఇంటిముందూ ఆగి రెండు పేపర్లు నడవలోకి విసిరి సైకిలెక్కి వెళ్ళిపోయాడు.

పొలం వెళ్ళిన చిన్న కుర్రవాడు ఘనకార్యం చేసుకువచ్చిన మొహముతో సైకిలుమీద తిరిగి వచ్చేస్తున్నాడు. సైకిలు వెనక కూరలతట్ట తాటినారతో గట్టిగా కట్టి ఉంది. పొలం వెళ్ళిరావడం అయింది.

ఇంక ఇలాక్కాదని కోటేశ్వరరావు జనార్దనరావు ఇంటికి వెళ్లాడు. నడవలోకి విసిరిసిన పత్రికలు నడవలో పడివున్నాయి. ఇంగ్లీషుది, తెనుగుది ! ఎవరూ తియ్యలేదు. జనార్దనరావు తిరిగి రాలేదు. వస్తే పేపరు చదువుతూ సావిట్లో కనబడును. అతను తిరిగి వచ్చేదాకా సావిట్లో కూర్చుంటే పేపర్లు చదువుకోవచ్చు. పిల్లల్ని పిలిస్తే ఉన్నదీ లేనిదీ తెలుస్తుంది.

''ఆ పేపర్లు తీసి టేబిలుమీద పెట్టండి. నాన్నొస్తే తిడతాడు'' అని ఎవరో లోపలనుంచి చెపుతున్నారు. జనార్దనరావు రాలేదని ఎవర్నీ అడక్కుండానే భోగట్టా తెలిసిపోయింది.

జనార్దనరావు ఎక్కడకు వెళతాడో తనకి బాగానే తెలుసు. బయలుదేరాడు. రెండువీధులు దాటి మెయిన్‌రోడ్డు దగ్గిర పడగానే జనార్దనరావు తిరిగివచ్చేస్తూ కనబడ్డాడు.

"నీకోసమే వస్తున్నాను" అన్నాడు కోటేశ్వరరావు.

"నేనూ నీకు కబురు పెడదామనుకొంటున్నాను." అన్నాడు జనార్దనరావు.

"ఎందుకూ?"

"ముందు నీ మాట చెప్పు".

సగం చచ్చిపోయాడు కోటేశ్వరరావు. సగం చచ్చిపోవడం సహజమే. తబ్బిబ్బు అవుతూ చెప్పుకున్నాడు.

"ఆపాటి దానికి పొద్దున్నే ఎందుకొచ్చావు కావు?" అని జనార్దనరావు ముదలకించాడు.

"సత్తువ లేకపోయింది."

"రెండడుగులు వెయ్యడానికా!"

"కాళ్ళకి కాదు మనస్సుకి."

"మంచి ప్రవృత్తే."

"ఈమధ్య నా పరిస్థితి అలాగా ఉంది."

"చెల్లెలి పెళ్లి చేసేశావు. ఇంక బరువులు లేవు. ఫరవాలేదులే."

"ఆ పెళ్లి బరువే గుదిబండలాగుంది."

"జాగ్రత్త అయినవాడివి. సర్దుకుంటావు, మళ్ళా పుంజుకుంటావు" అని ధైర్యంచెప్పి ఇంటికి తీసికెళ్ళాడు. కోటేశ్వరరావుకి పని సానుకూలం అయింది.

"బతికించావనుకో" అన్నాడు.

"సరే దానికేం. నీకు చెప్పవలసింది ముఖ్యమైందే ఉంది. నీకు కబురు పెట్టకుండా నువ్వే వచ్చావు."

జనార్దనరావు చెప్పేడు. అతను కుర్చీలో కూర్చోపెడతానంటే కోటేశ్వరరావు పీటమీద కూర్చోపెడితే చాలన్నాడు.

కోటేశ్వరరావు ఇంటికి వెళ్ళేసరికి ప్రయివేటుకి వెళ్ళిన పిల్లలిద్దరూ తిరిగివచ్చేశారు. వంటింటి వసారాలో కూర్చొని ఉడకబెట్టిన చిలకడ దుంపలు తింటున్నారు, తలో దుంపా. వాళ్ళపక్కన గ్లాసులతో నీళ్ళున్నాయి.

"తింటున్నారా? చేదు రాలేదుకదా!" అన్నాడు. ఒక్కొక్కటి చేదు రావడమే కాదు. దుర్గంధం కూడా కొడుతుంది. దెబ్బతిన్న దుంపలతో అదే పేచీ.

"దుంపంతా నేను తినలేను బాబూ, యిది నువ్వు తినెయ్" అని కూతురు తమ్ముడికి యిచ్చేసింది.

"ఓ నాకు పారీ నేను తినేస్తాను" అని కొడుకు తీసుకున్నాడు. ఉప్పూ పప్పా అడగని కూడు! దుంపలు ఉడకబెడితే చాలు.

అలివేలు సంచులూ రేషనుకార్డు తెచ్చి యిచ్చింది.

"ఇవి యిచ్చావేం?" అడిగాడు.

"వేషాలకి పోక వేగం వెళ్ళండి."

"వాడివ్వందే?"

"ఇచ్చినట్టు మొహం చెబుతూ ఉంటేనే! వెళ్ళనా మాననా అనుకొంటూ బీడీలు కాల్చారు."

"అంతేనా నా మొహం చెపుతున్నాది?"

"నీకు పెద్ద గౌరవం వస్తున్నాది."

"నాకే? ఏమిటి చెప్మా?"

"కావాలంటే నువ్వు కార్యదర్శివి కాబోతున్నావు."

"మహిళా సమాజానికా? దానికో దండం."

"అదేంకాదు. ఈ ఊళ్ళో మహిళల కో-అపరేటివ్ స్టోర్సు పెడుతున్నారు. నిన్ను కార్యదర్శిగా ఎన్నుకోబోతున్నారు."

"పెద్ద గౌరవమే! నాకక్కర్లేదు. ఈ గౌరవాలు భోజనాలు పెట్టవు."

"నేనూ అదే చెప్పేను. కార్యదర్శి పదవికాదు బాబో మాకు కావలసింది. ఆ స్టోర్సుకి ఒకరో యిద్దరో గుమాస్తాలు కావాలికదా? అందులో ఒక గుమాస్తా 'పదవి' విధిగా మా ఆవిడకి యిచ్చి తీరాలి అన్నాను."

"నిజంగా?"

"నిజంగా!"

"అలాగ అయితే కొండ అందుకుంటాము."

"అందుకుంటున్నాం."

"గుమాస్తా పదవి మనకి చాలు. ఏదో వేణ్ణీళ్ళకి చన్నీళ్ళు. కలిగున్న అమ్మ ఎవర్తో కార్యదర్శి అవుతుంది" అన్నాది అలివేలు.

"కలిగున్న అమ్మ కార్యదర్శి అవుతుంది" అన్నాడు కోటేశ్వరరావు.